# నిర్ణయం

— మేలుకల్లపల్లి కోటేశ్వరరావు

**ఇందిరకు** పెళ్ళి సంబంధం కుదిరింది!

ఊరంతా గుప్పుమంది వార్త.

ఇందిరకు అసలు పెళ్ళవుతుందా అని ఊరంతటికీ ఒక సందేహం.

ఆ సందేహాన్ని బద్ధలు చేసి ఇందిరకు పెళ్ళి కుదిరిపోయింది.

అలాగ అని ఇందిరకు కాలొంకరో, కన్నొంకరో, చెయ్యొంకరో లేవు.

ఇందిర తండ్రి రామారావు బాగా అప్పుల్లోనూ, సమస్యల్లోనూ కూరుకుపోయాడు.

అందుకే పెళ్ళి కుదిరిందంటే అదో వార్తయింది.

రాకేష్ శర్మ అంతరిక్షం లోనికో, చంద్ర మండలం లోనికో పోతే పాలకులకి తప్ప ప్రజలకేమీ ప్రయోజనం లేదు కాబట్టి ఎవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. సంతోషించ లేదు కానీ, ఇందిరకు సంబంధం కుదిరిందంటే వాళ్ళు చాలా సంతోషించారు.

ఇందిరంటే ఆ ఊళ్ళో ఎంతోమందికి మంచి అభిమానం. అందరితో మంచిగా ఉంటుంది. ఎవరికి ఏ అవసరం వచ్చినా తనకి చేతనయినే సాయం చేస్తుంది.

ఇందిరని చదివిస్తే బాగా రాణించేది. పది తరగతుల వరకూ చదువుకున్నది. తరగతిలో నూట ఇరవైమంది విద్యార్థు లుంటే అందరికంటే ఎక్కువ మార్కులతో పదో తరగతి పాసయింది.

హైస్కూల్ టీచర్లు మొదలుకొని ఊరి పెద్దల వరకూ చాలామంది ఇందిరని కాలేజీలో చేర్పించమని రామారావుకి చెప్పారు. ఇందిర కూడా చదువుకుంటానని అడిగింది. రామారావుకీ చదివించాలనే ఉన్నది. అయితే తరువాత వచ్చే కష్టాల్ని తలుచుకుని కాలేజీ చదువులకి పంపించలేదు.


కాలేజీ చదువు లయిన తరువాత పెళ్ళి చేయాలంటే సాధ్యమా? గ్రాడ్యుయేట్ అయిన అమ్మాయికి అంతకంటే ఎక్కువ చదువుకున్న వాణ్ణి కానీ, కనీసం అంతయినా చదువుకున్న వాణ్ణి కానీ తీసుకొచ్చి చేయాలి.

కట్నాల మార్కెట్‌లో వరుల రేటు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. వరుల రేట్లు ఆకాశంలో చుక్కల్ని చూస్తున్నాయి.

డిగ్రీ మిడికినవాడు పూరి గుడిసె సెంతం గతి లేకపోయినా అధమం అర లక్షయినా కట్నం అడుగుతున్నాడు. కూలిపని చేసుకునేవాడు కూటికి కూడా లేకపోయినా, వేలు వేలే కట్నా లడుగుతున్నాడు.

మగ పుటక పుడితే చాలు- వాడు ఎంత అధముడూ, వెధవా అయినా వాడికోసం ఆడపిల్లల తల్లితండ్రులు వెంపర్లాడుతున్నారు.

ఇలాంటి పరిస్థితిలో ఇందిరని పెద్ద చదువులు చదివించటానికి ఆయన ఇష్టపడలేదు.



ఇందిర తెలివైన పిల్ల, నిగర్వి.

ఇందిరకు పెళ్ళి కుదిరిం దంటే ఊరి వాళ్ళంతా సంతోషించారు.

"ఏవమ్మోయ్ ఇందిరో! సిగ్గుపడి లోపలికి తుర్రు మంటున్నావ్ గానీ, నీ మొగుడు గట్టోడే లే!" ఒక ముసలతను ఇందిరతో చతురాడుతూ అన్నాడు.

ఇందిర లోపలికి తుర్రు మనలేదు. సిగ్గు పడనూ లేదు. ఆ ముసలతని ముఖంలోనికి సూటిగా చూస్తూ, ఏమిటి అన్నట్లు నొసలు చిట్లించి చిరునవ్వు నవ్వింది.

"కట్నం దగ్గర గీచి గీచి నొక్కి నొక్కి బేరాలాడాడు. వాళ్ళు చెప్పిన దానికంటే పైసాకూడా కట్నం తగ్గలేదు." అప్పుడే వచ్చిన ఇందిర పిన తండ్రి నారాయణ అన్నాడు.

"ఏమయిం దేమిటి, బాబాయ్?" ఇందిర అడిగింది.

"కావటానికి ఏముందమ్మా? నాన్నేమో పాతిక వేలు డబ్బూ, ఎకరం పొలం, అయిదు సవర్ల బంగారం ఇస్తా నన్నాడు. అత నేమో డబ్బు ముప్పయి అయిదు వేలు అడిగాడు."

"ఏమీ తగ్గించ లేదా?"

"పైసా కూడా తగ్గించనని చెప్పాడు. అప్పటికీ నువ్వు చదువుకున్న దాని వని తక్కువ అడిగారట. అతనికి అంతకంటే ఎక్కువ ఎవ డిస్తాడో? వాళ్ళడిగినంత కట్నం ఇష్టమైతేనే ఇవ్వమనీ. లేకుంటే వేరే సంబంధం చూసుకొమ్మనీ చెప్పాడు."

"అతని అమ్మా నాన్నలు ఏమన్నారు?"

"అసలు వాళ్ళు నోరెత్తితేగా? అన్నీ ఇతనే మాట్లాడుతున్నాడు. తనకి ఉయ్యూరు వాళ్ళో. ఎవరో లక్ష రూపాయలిస్తా మన్నారట. వాళ్ళని కాదని నిన్ను చేసుకుంటున్నాడట!"

"అతను అంత అవమానకరంగా మాట్లాడి నప్పుడు మీరు లేచి రాకపోయారా?"

"అవమానం ఏముందమ్మా అందులో? కట్నా లన్న తరువాత బేరసారాలు తప్పవు."

"తలకి మించిన బరువెందుకు, బాబాయ్? వాళ్ళు కాకపోతే ఇంకొక రవుతారు."

"ఇక దానికి అంతం ఎక్కడ? అందరూ అలాగే ఉన్నారు. ఇంకా ఎన్నేళ్ళని చూడగలం?"

"ఎన్నేళ్ళంటే... మనకి సరైనవాళ్ళు దొరికేవరకు ఓపిక పట్టలేమా?"

"పోనీ లేమ్మా, కుర్రోడు మంచోడు."

"వాళ్ళ మంచి మన కేమి తెలుస్తుందిలే? ఎర్రగా, బుర్రగా ఉన్నంత మాత్రాన మంచో డవుతాడా?"

"పదో తేదీ మంచి రోజట. ఆ వేళ లగ్నాలు పెట్టుకుంటారు." ఆయన విషయాన్ని తేలకొడుతూ లేచాడు.

పెళ్ళికొడుకుది ఆ ఊరికి పది మైళ్ళ దూరంలో ఉన్న ఒక పల్లెటూరు. పేరు సుధాకర్. తల్లితండ్రులకి ఒక్కడే పుత్రుడు. బి.కామ్. చదివాడు. ఉద్యోగం లేదు. అయిదు ఎకరాల పొలం ఉంది. ఒక చిన్న ఇల్లుంది. ఇరవై వేలు అప్పుంది.

అతను అందంగానే ఉంటాడు. స్టయిల్‌గా ఉండటానికి కూడా ప్రయత్నిస్తుంటాడు.

వాళ్ళు ఇంత ఎక్కువ కట్నా లడుగుతారని ముందుగా రామారావు వాళ్ళు ఊహించలేదు. రామారావు ఇవ్వగలిగిన తాహతుకి మించి కట్నం




అడిగారు.

తిరిగి తిరిగి విసుగు పుట్టిపోయింది. నాలుగేళ్ళనుంచీ కాలికి బలపం కట్టుకుని తిరిగారు. కొద్దిగా అందుబాటులోనూ, అన్నిటికీ వీలైన సంబంధం ఇదే అనుకున్నారు. అందుకే రంగంలో దిగారు.

చివరికి అతి కష్టంమీద వా ళ్ళడిగిన కట్నానికి సంబంధం నిశ్చయమైపోయింది.

"లాంఛనాలు విషయం చెప్పాల్సిన అవసరం లేదు కదా! అవి మీరు బాగా జరపాలి. మళ్ళీ తరువాత పెట్టలేమంటే లాభం లేదు." సుధాకరే అన్నాడు—

"లాంఛనాలు జరపకుండా ఎలా ఉంటాం లెండి? ఏదో మాశక్తికొద్దీ జరుపుతాం." ఆ ప్రస్తావన అంతటితో ఆగిపోయింది.

పెళ్ళి కొడుకు తండ్రి మాట మాటకూ, "మా వాడికి అసలు దాపరికాలు ఏం ఉండవండీ! అడిగే మాటేదో ముఖం మీదే అడుగుతాడు" అంటూ కొడుకు ధోరణికి తాళం కొడుతున్నాడు.

అన్ని విషయాలూ మాట్లాడుకోవటం అయిపోయిన తరువాత సుధాకర్ లేస్తూ, "రేపు లగ్నాలు పెట్టుకునే రోజు కొంత డబ్బు ఎడ్వాన్స్ చేయండి" అన్నాడు, మాటల మధ్యలో తన ఇంగ్లీషు పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ.

"సరే, చూద్దాం లెండి. తప్పుతుందా?" అంటూ చావునవ్వు నవ్వాడు రామారావు. ఏడవలేక నవ్వటం అన్న మాట అది.

పసుపు, కుంకుమలు పెట్టుకున్నారు.

పదో తేదీ వచ్చింది.

లగ్నాలు పెట్టుకోవడానికి వచ్చే వాళ్ళకోసం రకరకాల టిఫెన్లూ, వంటలూ చేసి పెట్టారు.

అనుకున్నట్లుగానే మధ్యాహ్నానికి ఎనిమిది మంది ఆడా, మగవాళ్ళు కలిసి వచ్చారు. వచ్చిన వెంటనే టిఫిన్లు మెక్కి, కూల్ డ్రింక్స్ సేవించారు.

వాళ్ళ వెంట సుధాకర్ రాలేదు. అతని తల్లితండ్రులూ, బంధువులూ, మేనమామా వచ్చారు.

ఆ మేనమామకి కూతుళ్ళు లేరు. అందుకే సుధాకర్ వధువులకోసం దేశం మీద పడ్డాడు. ఆయనకే కూతుళ్ళుంటే ఇతని పాలిట వాళ్ళూ, వాళ్ళ పాలిట ఇతనూ పడేవాళ్ళు.

రావటంతోనే, "పిల్లని చూపెట్ట" మన్నాడు.

ఇందిరని అలంకరించి తీసుకొచ్చి చూపించారు.

"అమ్మాయి పర్లేదు" అని సర్టిఫికేట్ ఇచ్చాడు.

"మావాడికి బాంకిలో ఉజ్జోగం ఇస్తామన్నారు. అయితే, ఖర్చు ఇరవై వేలు అవుతుంది. వాళ్ళ దగ్గరా డబ్బు లేదు. మీరు కట్నం పెంచకపోతే లాభం లేదు." బాంబు పేల్చాడు మేనమామ.

రామారావు నెత్తిమీద ఆ బాంబు పడి అదిరిపడి లేచాడు. "అదేమిటి? మొన్ననే కట్నాలు మాట్లాడుకున్నాం గదా!"

"మాట్లాడుకున్నారు లెండి. మాట్లాడుకోలేదని కాదు కానీ, ఇప్పుడు బాంకిలో ఉజ్జోగం కోసం ప్రయత్నిస్తున్నాం. ఈ అవకాశం పోతే రాదు."

"ఈ కట్నం ఇవ్వటానికే మా పని తలకిందులయ్యేట్టుగా ఉంది. ఇంతకంటే ఎక్కువ కట్నం ఇవ్వటం మా వల్ల కాదు."

"కాదంటే ఎట్టా? ఇంకో పది వేలు ఇవ్వండి." మేనమామ అన్నాడు—ఇంకో పది పైసలు ఇవ్వమన్నంత సులభంగా.

"పది వేలే? పది రూపాయలు కూడా ఇవ్వలేము. ఎందు కొచ్చిన మాటలు?"

"మీరు ఇవ్వలే మంటే కుదిరిద్దా? అన్నీ నిర్ణయమై పోయాక పది వేల దగ్గర పట్టుకుంటే యట్టా?"

"మేము పట్టుకునే దేముందండీ- అన్నీ సెటిలయిన తరువాత మీరే పేచీలు పెడుతున్నారు కానీ? ఇప్పటికే ఇది మాకు తాహతుకి మించిన పని."

"మీ ఇష్టమండీ! మీరు ఇవ్వలేమంటే మేము చేయగలిగే దేమీ లేదు. మీరు ఇవ్వగలిగితేనే లగ్నాలు పెట్టుకుందాం, లేకపోతే లేదు."

"మేం కట్నం పెంచకపోతే లగ్నాలు పెట్టుకోరా?"

"మా వాడే చెప్పాడండీ— మనం అడిగిన డబ్బుకి ఇష్టపడితే లగ్నాలు పెట్టుకు రమ్మనీ. లేకపోతే లేదనీ..."

పెళ్ళి కుదిరిందని ఊరంతా తెల్సిపోయింది. మళ్ళీ ఇప్పు డో అడ్డంకి. ఆడపిల్ల పెళ్ళి తప్పిపోయిందంటే ఎంత అప్రతిష్ఠ.

"మొన్న అతనే గదండీ కట్నం మాట్లాడుకున్నది. ఆయన అడిగినంత కట్నం ఇస్తున్నాం కదా!"

"నిజమే కానీండి, ఉజ్జోగం వస్తున్నది.... దానికోసమే అడిగారు."

"ఉజ్జోగ మొస్తుందనే కదండీ అంత కట్నమియ్యటం. లేకపోతే ఆయన ఆస్తిని చూసి ఇస్తున్నామా ఏమిటి?"

"తగాదా వద్దు కానీ, పది వేలు ఇయ్యలేకపోతే ఎనిమిది వేలు ఇవ్వండి."

రామారావు వాళ్ళు లోపలికి వెళ్ళి మాట్లాడుకున్నారు. కుదిరిన సంబంధం. అన్నీ బాగానే ఉన్నాయి. అతనికి ఉద్యోగం కూడా వస్తుందని చెపుతున్నారు. వాళ్ళు అడిగినంత కాకపోయినా ఎంతో కొంత ఇస్తే పేచీ ఉండదు.

"నాలుగు వే లిస్తామండీ!" రామారావు అన్నాడు.

మళ్ళీ ఆ బేరం దగ్గర గంట సేపు వాదనలూ, బేరసారాలు సాగాయి. వీళ్ళు వీలైనంతవరకూ తక్కువ ఇద్దామనీ, వాళ్ళు దొరికినంత వరకూ గుంజుదా మనీ—

చివరకూ పెద్ద మనుమలు అయిదు వేల రూపాయలకు బేరాన్ని సెటిల్ చేశారు.

పెళ్ళి కొడుక్కి మొత్తం నలభై వేలు డబ్బూ, ఎకరం పొలం, అయిదు నవర్లు బంగారం గిట్టుబాటయ్యాయి.

అయితే, రామారావుకి మాత్రం ఇది శక్తికి మించిన పని.

ఆయనకి ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూ. పెద్ద కూతురు ఇందిర. ఒక కొడుకు కాలేజీలో చదువుతున్నాడు. మిగతా ఇద్దరు పిల్లలూ హైస్కూల్ చదువు.

అయినా సరే, అప్పులు చేయటానికే ఆయన సిద్ధ మయ్యాడు.

అప్పులు సమస్య కాదు. పెళ్ళి కావాల్సిన ఆడపిల్ల ఇంట్లో ఉండటం పెద్ద సమస్య! ఘోరమైన సమస్య!

లగ్నాలు పెట్టుకున్నారు.

మధ్యలో రెండు వారాలు. ఇరవై నాలుగో తేదీ పెళ్ళి.

లగ్నాలు పెట్టుకున్న తరువాత రామారావు పెళ్ళి ఖర్చులకోసం పెళ్ళి కొడుకు తల్లితండ్రులకి పెద్ద మనుమల సమక్షంలో పది వేలు అడ్వాన్సు ఇచ్చాడు.

ఆ వచ్చిన వాళ్ళు మళ్ళీ మరోసారి తిండిమైసి తిరుగుముఖం పట్టారు.

** ** **

"సీతారాముల కల్యాణం చూతము రారండి ...శ్రీ సీతారాముల కల్యాణం..." మైకు వాళ్ళ కల్యాణం చూడటానికి రమ్మని గోల చేస్తూ అరుస్తోంది. రాజకీయ నాయకులు వేదిక లెక్కి ఉపన్యాసాల హోరుతో ప్రజల్ని చిత్రహింసలు పెట్టినట్లుగా.

అసలే పెళ్ళిళ్ళలో గోలయితే, ఆ గోలకి తోడు ఈ మైకు గోల ఒకటీ!

పెళ్ళి పందిరి జనంతో నిండిపోయి ఉంది. చాలామంది బంధువులు కొత్త బట్టలతో కళకళలాడుతూ, తళతళా మెరిసిపోతున్నారు.

రాత్రి పన్నెండు గంటలకు పెళ్ళి.

"కాఫీలు...కాఫీలు..."

ఇద్దరు కుర్రవాళ్ళు చిన్న చిన్న గ్లాసుల్లో కాఫీలు పోసి అందిస్తున్నారు.

"ఇటు రండోయ్, ఇటు రండోయ్" అంటూ ఆ కాఫీ లందించే వాళ్ళ ప్రాణాల్ని తోడేస్తున్నారు కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకునే వాళ్ళు.


"ఈ కాఫీలతో పాటు టిఫెన్ కూడా ఉంటే బావుండేదే!" ఓ మూ ల చేరి చతుర్ముఖ పారాయణం చేస్తున్న గుంపులో నించి ఒకడు అన్నాడు.

"కాఫీ కొట్రా చాలు! మన మొఖాలకి టిఫెన్లెందుకు? అవో దండగ వాళ్ళకి!"

"దండ గంటే ఎలా, గురూ! పెళ్ళంటేనే దండగ... పైగా దండన కూడా! తప్పదు. వచ్చిన బంధువుల అవసరాలు తీర్చాలి."

పేకాడుతోన్న ఆ కాలక్షేప బృందం ఉత్సాహంగా ఉన్నారు. ఆనందంగా అరుస్తున్నారు.

ఆభరణాలు, అలంకారాలతో పాటు పట్టు చేరల రెపరెపలతో ఎదురు నడవటం, అర్ఘ్యం నడవటం లాంటి పనులతో క్షణం తీరిక లేకుండా హైరానా పడిపోతున్నారు ఆడవాళ్ళు.




చుట్టు పక్కల జనాల్ని నిద్ర పోనివ్వకుండా మైకు గోల పెడుతోంది.

"మగ పెళ్ళి వా ళ్ళొస్తున్నారో..." అంటూ కేకేశారు ఎవరో.

హడావుడి పుంజుకుంది.

విడి దింటికి తీసుకుపోయారు వాళ్ళని.

తరువాత మేళతాళాలతో, సన్నాయి వాద్యాలతో పెళ్ళి కొడుకుని పెళ్ళి కూతురు ఇంటికి తీసుకువచ్చారు.

నలుగు పెట్టడం, గోళ్ళు తీయటం లాంటి కార్యక్రమాలు అయిపోయాయి.

అల్లుడు పెళ్ళి పీటలమీద కూర్చొబోయే ముందు మామగారు ఇచ్చే బట్టల్ని కట్టుకోవాలి.

ఆ బట్టల్ని చూస్తూనే సుధాకర్ అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు. "పెళ్ళి కొడుక్కి మీరు తెచ్చే బట్ట లివేనా? మాఊరి అడుక్కు తినేవాళ్ళు కూడా ఇలాంటి బట్టల్ని కట్టుకోరు" అంటూ ఆ బట్టల్ని నేలకేసి విసిరి కొట్టాడు.

అల్లుడి అలక వార్త విని రామారావు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"టెరీకాటన్ పంచెలు తీసుకొస్తారా? ఇలాంటి ముతక పంచెలు తీసుకొస్తారా?" అంటూ రామారావుని సూటీగా అడిగాడు.

"ఇవి నాణ్యమైన రకం అంటేనే తీసుకొచ్చాము! కావాలంటే ఎవర్నయినా తెల్సినవాళ్ళని అడగండి?"

"తెల్సిన వాళ్ళని అడిగే దేమిటి? నాకు తెలియ దనేనా మీ ఉద్దేశం? ఇవి నాణ్యమైనవని ఏ బుద్ధున్నవాడితో నైనా చెప్పించండి. నాకు టెరికాట్ పంచెలు తెప్పించండి."

ఆ ఊళ్ళో రెండు, మూ డు బట్టల దుకాణాలున్నా యి. రామారావు ఆ అర్ధరాత్రి ఆ దుకాణాలకి పరుగు లంకించుకుని, వాళ్ళని నిద్ర లేపి, అల్లుడు కోరిన పంచెలు తెచ్చి ఇచ్చాడు.

పెళ్ళి పీటలమీద కూర్చోవటానికి ముందే కట్నం డబ్బు మొత్తం సుధాకర్ తండ్రికి లెక్కగట్టి ఇచ్చారు.

పెళ్ళి కూతురినీ, పెళ్ళి కొడుకునీ పెళ్ళి పీటల మీద చూసిన వాళ్ళు ఆశ్చర్యంగా సంతోషపడిపోతున్నారు. జంట చూడ ముచ్చటగా ఉంది.

"చిలుకా, గోరింకలుగా ఉన్నారు!" అంటున్నారు చూసిన వాళ్ళు. చక్కటి పొడుగూ, రంగూ ఇద్దరూ ఇద్దరే!

పురోహితుడు మంత్రాలు వల్లిస్తున్నాడు.

బాండు మేళగాళ్ళు తన్మయంగా తల లూపుకుంటూ వాయిస్తున్నారు.

ఎవరో ఒకతను వచ్చి సుధాకర్ చెవిలో ఏదో చెప్పాడు.

సుధాకర్‌కి దగ్గరగా రామారావు కూర్చుని ఉన్నాడు.

"ఏమండీ! మాట!" రామారావుని దగ్గరకు రమ్మని సుధాకర్ పిలిచాడు.

రామారావు ఆత్రతగా వచ్చాడు.

"వాచీ, ఉంగరమూ , సైకిలూ తీసుకు రాలేదట కదా!" అడిగాడు.

లాంఛనాలు ఇస్తామని అన్నారు కానీ, ఫలానా సామానులు ఇస్తామని ప్రత్యేకంగా చెప్పలేదు.

"అది ఇస్తామని ఎవ రన్నారు?"

"అదేమిటండీ... లాంఛనాలు అసలు పెట్టరా? మా ఊళ్ళో మేము తలెత్తుకోవాలా, అవసరం లేదా?"

"అసలు అవి ఇస్తామని ఎవరు చెప్పారండీ? లాంఛనాలంటే మాకు ఇష్టమైనవి ఇస్తాం కానీ, మీరు కోరినవి ఇస్తామా ఏమిటి?" రామారావు అన్నాడు.

ఏమిటా వాళ్ళిద్దరూ మాట్లాడుకోవటం అని అప్పటికే చిన్న గుంపు వాళ్ళ దగ్గర ప్రత్యక్షమయ్యింది.

"లాంఛనాలకి ఎంతో కొంత డబ్బు ఇవ్వండి!"

"ఇస్తామండీ! మీరు గొడవ పెడితే బాగుంటుందా? పెళ్ళి అయిన తరువాత మీరు కోరినవి ఇస్తా మంటున్నాం కదా! దయచేసి పెళ్ళి కానివ్వండి!" రామారావు వేడికోల్లుగా అన్నాడు.

అప్పటికే బాండు మేళాలు ఆగిపోయాయి.

పురోహితుడు మంత్రాలు చదవటం ఆపి వీళ్ళ వైపు విచిత్రంగా చూస్తున్నాడు. "కానివ్వండి... కానివ్వండి! లగ్నానికి టైమ్ దాటిపోతున్నది" అంటున్నాడు.

ఇదంతా గమనిస్తూ అసహనంగా కూర్చున్న ఇందిర విసురుగా పెళ్ళి పీటల మీదనించి లేచింది. నుదుటిమీద కట్టిన బాసికాలు ఒక్క విసురుతో లాగి పెళ్ళి పీటలమీద విసిరికొట్టి చరచరా ఇంట్లోకి దారి తీసింది.

ఇందిర లేవటం గమనించిన రామారావు... "అలాగే డబ్బు లిస్తాం లెండి...కూర్చోమ్మా, ఇందిరా!" అంటున్నాడు.

ఇందిర ఆయన మాటలు వినిపించుకోలేదు.

పెళ్ళికొడుకు బిత్తరపోయి చూస్తున్నాడు.

ఆశ్చర్యం నించి తేరుకున్న జనం ఇందిర వెంట లోపలికి పరుగులెత్తారు.

"మీ నాన్న ఇస్తా నంటున్నాడే, రామ్మా!" ఒకామె అన్నది.

"నే నీ పెళ్ళి చేసుకోను, నా కిష్టం లేదు!"

ఇంతలో రామారావు కూడా వచ్చాడు. "అదేంటమ్మా ఇందిరా? పెళ్ళి పీటల మీదనించి లేవటం ఏమిటి? ఆయ నడిగినట్లు ఇస్తున్నాం కదా!" అన్నాడు.

"మీరు ఇవ్వలేదని కాదు, నాన్నా! నేను అతణ్ణి చేసుకోను... కట్నాల దగ్గర వాడు ఇది నాలుగోసారి పేచీ పెట్టటం. రేపు పెళ్ళయిన తరువాత కూడా మీ పుట్టింటినించి అవి తీసుకు రమ్మనీ, ఇవి

20-3-85

తీసుకు రమ్మనీ పీడించడని నమ్మక మేముంది?"

"అడిగితే మేము చూసుకుంటాం కదా! నువ్వు వచ్చి పీటలమీద కూర్చోమ్మా!" రామారావు అన్నాడు.

"ఏమిటి మీరు చూసుకునేది? ఇప్పుడే నాలుగు సార్లు పేచీలు పెట్టినవాడు తరువాత మాత్రం అడక్కుండా ఎందు కుంటాడు? రేపు నన్ను డబ్బు తీసుకు రమ్మని కొడితే మీకు తెలుస్తుందా? రోజు పేపర్లలో చూడటం లేదా... ఎంతమంది అమ్మాయిల్ని తమ భర్తలు డబ్బుకోసం పీడించీ. హింసించీ చంపుతున్నారో! తెలిసీ. తెలిసీ నన్నా అగ్నిగుండంలో ఎందుకు దూకమంటారు?"

"ఎవరో ఏదో చేశారని..." ఓ ముసలి పెద్దమనిషి అన్నాడు.


"ఎవరో ఏదో చేయటం కాదు. కట్నాలకోసం. డబ్బు కోసం వెంపర్లాడే వాళ్ళంతా చేస్తున్నారు. వరకట్నం చావు లేని పేపరు చూపెట్టండి. ఎన్ని హత్యలూ. ఆత్మహత్యలూ జరగటం లేదు? అవి నగం కూడా బయట పడవు. ఆ బయట పడేవే వందలకొద్దీ సంఘటనలు జరుగుతున్నాయి. ఆడవాళ్ళంటే ఏముంది? ఎంత చదువుకున్నా వంటింట్లో వంటలు చేసుకుంటూ బతక్క తప్పదు. తగలబెట్టి చంపి. వంటగదిలో ఏ స్టౌవ్ అంటించబోయేసరికో. ఏ పొయ్యి ముట్టించబోయేసరికో తగలబడి మరణించిందని చెబితే ఇక దిక్కేముంటుంది? ప్రమాదమని చెప్పవచ్చు. ఈ వంటలు మెట్టినింటి వాళ్ళ చేతుల్లో మారణాయుధాలు! రేపు నాక్కూడా అలాంటి ప్రమాద మేదీ జరగదని మీలో ఎవరైనా రాసివ్వండి. అతణ్ణి నేను చేసుకుంటాను." ఇందిర ఆవేశంతో ఊగిపోతూ కుండబద్దలు గొట్టినట్లు గడగడా చెప్పేసింది.

"ఏమిటమ్మా. ఇందిరా. అంత పట్టుదల? నీకేమైనా జరిగితే మేము ఊరుకుంటామా?"

"నాకు ప్రమాదం జరిగిన తరువాత ఊరుకోక మీరు ఏం చేస్తారు? మనూళ్ళోనే మన కళ్ళముందే నలుగురు చచ్చిపోయారు బావుల్లో దూకి. మందు తాగి. ఇంట్లో పోరు భరించలేకనే వాళ్ళంతా చచ్చిపోయారు. మ నూళ్ళోనే ఒకమ్మాయిని తగలబెట్టి చంపేశారు. వా ళ్ళందర్నీ ఏం చేయగలిగారు? ఎక్కడిదాకో ఎందుకు? మా పెద్దమ్మమ్మ కూతురు నాగమణి పిన్నిని మరింత కట్నం తీసుకు రాలేదని కాల్చి చంపేశారు. మా పిన్నిని చంపటం కళ్ళారా చూసినవా ళ్ళున్నారు. కోర్టులో. పిన్ని మొగుడు వాళ్ళే తగలబెట్టి చంపారని సాక్ష్యం చెప్పారు చూసిన వాళ్ళు. అయినా కేసు ఏమయ్యింది? ఓడిపోయింది. స్పష్టంగా చూసిన వాళ్ళు చెప్పినా సరే. కోర్టు నమ్మలేదు. మా పిన్ని ఆత్మహత్య చేసుకున్న దని తేల్చి ఆమె భర్తనీ. అత్తనీ. మామనీ వదిలిపెట్టారు. డబ్బూ. అధికారమూ. పలుకుబడీ ఉన్నవాళ్ళే కోర్టులో గెలుస్తారు కానీ. మనలాంటి పేదవాళ్ళూ. సామాన్యులూ కోర్టులో గెలవటం కలలో మాట."

"ఇందిరా! తొందర పడకమ్మా!" ఇందిర వాక్ప్రవాహాన్ని అరికడుతూ ఒకతను అన్నాడు.

"నే నేం తొందర పడుతున్నాను? తెలిసి కూడా ఇలాంటి డబ్బు మనుషులకి న న్నెందుకు కట్టబెట్టాలని చూస్తున్నారు? ఇప్పుడే డబ్బుకోసం నాలుగుసార్లు పేచీలు పెట్టినవాళ్ళు రేపు ఇంకా కట్నం తీసుకు రమ్మని ఎందుకు పీడించరు? నీతి జాతీ లేనివాళ్ళూ. మాట తప్పే వాళ్ళూ రేపు మాత్రం నిజాయితీగా ఉంటారని ఎలా నమ్మాలి?"




ఇందిర వేసే ప్రశ్నలు శూలాల్లా దిగబడుతున్నాయి. వాటికి ఎవరూ సమాధానాలు చెప్పుకోలేక హడలిపోతున్నారు.

ఇంతలో రాజీ చేయటానికి పెళ్ళికొడుకు తరుపు వాళ్ళు నలుగు రైదుగురు వచ్చారు. "లాంఛనాలు ఇవ్వకపోయినా పర్లేదు. ఏదో తెలిసీ తెలీక అడిగాడు. పెళ్ళి పీటలమీద అడిగేవాళ్ళు ఎవరైనా ఉంటారా తెల్సినవా ళ్ళయితే? వాడికి సరిగా తెల్సిన వ్యవహారం కాదులెండి! పెళ్ళి కానివ్వండి ముందు."

"తెల్సినవాడు కాకపోతే అలాంటి మొద్దుని చేసుకుని నేను మాత్రం ఏం సుఖపడతాను?"

"ఇందిరా! కొద్దిగా ఆలోచించుకుని మాట్లాడు." రామారావు అర్థిస్తున్నట్లుగా అన్నాడు.

"ఇంకా ఆలోచించే దేమిటి. నాన్నా? ఇంతవరకూ ఎందుకు ఆగానా అని ఆశ్చర్యపోతున్నాను. మొదటిసారి పేచీ పెట్టినప్పుడే నా అభిప్రాయాన్ని చెబితే బాగుండేది. ఇప్పుడు ఇంత బాగా వాళ్ళ స్వభావం తెల్సిన తరువాత అలాంటి వాడిని ఎలా చేసుకుంటాను. నాన్నా?"

ఏ పెళ్ళిలోనూ ఎప్పుడూ. ఎవరూ ఊహించలేని సంఘటన ఇది. ఎవరికి వాళ్ళు ఆశ్చర్యపోతునారు. కొంతమంది ఇందిరని పొగుడుతున్నారు. ఇంకొంతమంది ఇందిర ధైర్యానికి విస్తుపోతున్నారు.

ఇక ఈ పెళ్ళి జరగ దనుకున్నారు. మగపెళ్ళివాళ్ళు తమ ఊరు తరలిపోయే ప్రయత్నాల్లో ఉన్నారు.

"మా డబ్బు మొత్తం తీసుకొచ్చి ఇవ్వండి." ఇందిర తరపు పెద్దవాళ్ళు అడిగారు.

"ఇస్తాంలే... మీ బోడి డబ్బు ఎవడి క్కావాలి?" సుధాకర్ తలబిరుసుగా అన్నాడు.

సుధాకర్ తండ్రి- "ఒరేయ్! నోర్మూసుకో నువ్వు... దరిద్రపు వెధవా!" అంటూ కొడుకుని కసురుకున్నాడు. "ఏదో పొరపాటు జరిగిపోయింది. లాంఛనాలూ. గీంచనాలూ వద్దు కానీ. పెళ్ళి జరిపించండి. అంతగా అయితే కట్నం మీ ఇష్టం వచ్చినంత ఇవ్వండి. మీరు ఎంత ఇచ్చినా మాకు సంతోషమే!" అంటూ కాళ్ళ బేరానికి వచ్చాడు.

"పెళ్ళి జరగదు కానీ. ముందు మాడబ్బు కట్టి కదలండి" అన్నారు వాళ్ళు.

ఆ రోజు ఇచ్చిన డబ్బు తిరిగి ఇచ్చేశారు. లగ్నాలు పెట్టుకునే టప్పుడు అడ్వాన్సుగా ఇచ్చిన పది వేలూ ఇంటికి వెళ్ళి పంపిస్తా మన్నారు.

"మిమ్మల్ని నమ్మిం దెవరు? మీరు ఇంటికి వెళ్ళి పంపిస్తా మంటే ఊరుకునేది లేదు. మాకు ఇప్పుడే కట్టాలి!"

"ఇప్పుడు కట్టాలంటే ఎలాగండీ? మా దగ్గర ఇప్పుడు ఎక్కణ్ణుంచి వస్తాయి?"

"మరి అందరి ఇబ్బందులూ అలాంటివే అనుకోకూడదూ? మా డబ్బు కట్టేవరకూ మిమ్మల్ని వదిలేది లేదు."

"గొంతుమీద కూర్చుంటే ఎలాగండీ?"

"గొంతుమీద కూర్చోవటం కాదు. గొంతు తొక్కి కూర్చుంటాం మాట్లాడారంటే...మీరు మీ ఊరు పోయి డబ్బు తీసుకుని రండి. అప్పటి వరకూ వీడు ఇక్కడే ఉంటాడు. రేయ్! వీణ్ణి గదిలో వేసి తాళం వేయండ్రా!" రామారావు సుధాకర్‌ని చూపిస్తూ అన్నాడు.

పెళ్ళి పీటలమీద కూర్చోవాల్సిన వాడిని కొంతమంది ఈడ్చుకుపోయి గదిలో పడేశారు.

ఇదంతా గమనిస్తున్న ఒక యువకుడు- "మీ కిష్టమైతే ఇందిరని నేను చేసుకుంటా నండీ!" అన్నాడు. ఆ అబ్బాయి ఇందిర వాళ్ళకి దూరపు బంధువు. ఎక్కువ చదువుకోలేదు. పెద్ద ఆస్తి లేదు.

అతని తల్లితండ్రులు కూడా పెళ్ళికి వచ్చారు. వాళ్ళూ ఇష్టపడ్డారు. "మాకు అమ్మాయి ముఖ్యం... పైసా కూడా కట్నం అవసరం లేదండీ!" అన్నారు వాళ్ళు.

"ఏ మంటావమ్మా. ఇందిరా?" రామారావు అడిగడు.

"మీ ఇష్టం. నాన్నా!"

అదే ముహూర్తానికి పెళ్ళి కావా లనుకున్నారు.

అప్పటికప్పుడే తన్నులు తిన్న పెళ్ళికుడుకు కోసం తెచ్చిన బట్టలు ఇతనికి ఇచ్చారు.

ఇందాకటి గందరగోళంలో నోరు పడిపోయిన మైకు మళ్ళీ ఎత్తుకుంది" "సీతారాముల కల్యాణము చూతము రారండీ..." అంటూ.

బాండు మేళగాళ్ళు సంతోషంతో విజృంభించారు.

పురోహితుడు ఉత్సాహంగా మంత్రాలు మొదలెట్టాడు.

అరగంట క్రితం బోసిపోయి నిరుత్సాహంగా. గందరగోళంగా ఉన్న పెళ్ళి పందిరి తిరిగి కళ పుంజుకుంది. అందరి కళ్ళలోనూ ఆనందం వెల్లివిరిసింది. ●